సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 25 । నవంబర్ । 2023



చిరుధాన్యం సాగుకు..

చిరుధాన్యం సాగుకు ప్రాధాన్యం పెరుగుతోంది. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది.

- 10లో



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం పాలయ్యారు. కంచిలి మండలంలో ప్రమాదం జరిగింది.

- 10లో

కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో ఉద్యోగ అవకాశాలు

శ్రీకాకుళం: పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ డయాలసిస్ యూనిట్‌లో 5 డయాలసిస్ టెక్నిషియన్‌లు, 2 సీఆర్మ్ టెక్నిషియన్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.స్వామినాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల దరఖాస్తులను ఈనెల 27వ తేదీ వరకూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు లోపు వరకూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో స్వీకరించనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

'శాశ్వత లోక్ అదాలత్ వినియోగించుకోండి'



మాట్లాడుతున్న జి.జ్ఞాన శ్రీ సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాశ్వత లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన శ్రీ సువర్ణరాజు కోరారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం శనివారం న్యాయ సేవా సదన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజల్లో సరైన అవగాహన లేదని, ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

డిసెంబర్ మొదటి వారంలో హెవీ డ్రైవింగ్ శిక్షణ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో 15వ బ్యాచ్ డిసెంబర్ నెల మొదటి వారంలో ప్రారంభమవుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 14 బ్యాచ్‌లు పూర్తయ్యాయని, జిల్లాలో ఏకైక గవర్నమెంట్ డ్రైవింగ్ స్కూల్ ఏపీఎస్ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ అని అన్నారు. హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో సంస్థలో అత్యుత్తమ, నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇస్తామని తెలిపారు. తదుపరి బ్యాచ్, ఫీజు వివరాల కోసం 9963091999. 7989723505. ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ అవార్డుకు ముద్దపు ప్రసాదరావు ఎంపిక

గార : కేంద్ర పశుసంవర్ధకశాఖలో అత్యున్నత అవార్డు అయిన గోపాలరత్నకు గార మండలం జల్లువలస గ్రామానికి చెందిన గోపాల మిత్ర ముద్దపు ప్రసాదరావు ఎంపికయ్యారు. ఈ మేరకు సంబంధిత శాఖ నుంచి సమాచారం వచ్చిందని ఆయన తెలియజేశారు. ఏఐ టెక్నీషియన్స్ (పశువులకు కృత్రిమ గర్భోత్పత్తి ఇంజెక్షన్లు వేయడం)కు గాను దేశంలో ముగ్గురు గోపాలమిత్రలను అవార్డులకు ఎంపికచేశారు. ఈ నెల 26న జాతీయ పాలదినోత్సవం సందర్భంగా అసోంలో కేంద్రమంత్రి ద్వారా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

'దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరిస్తున్నాం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించిన కారణంగా కేవలం ఒక్క శాతం దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఎన్నికల సన్నద్ధత, పెండింగ్ దరఖాస్తులపై విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఫారం 6, 7 8 లకు సంబంధించి 28,413 దరఖాస్తులు రాగా వాటిలో 30 రోజులు దాటిన పెండింగ్ దరఖాస్తులు 993 మాత్రమే ఇంకా పరిష్కరించాల్సి ఉన్నాయని చెప్పారు. గడచిన మూడు వారాల్లో 45,567 వివిధ దరఖాస్తులు రాగా 24,769 పరిష్కారమయ్యాయని కలెక్టర్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన 21,662 మంది కొత్తగా ఓటు హక్కు కో సం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ప్రతివారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారికి వారం వారం

గర్భగుడి నుంచి.. గుండె గుడికి



స్వామి ఉత్సవ మూర్తులు



హంసనావపై ఇంద్ర పుష్కరిణిలో ఆదిత్యుని జల విహారం

- హంస నావలో ఊరేగిన ఆదిత్యుడు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చిన సూర్యనారాయణ మూర్తి
- శ్రీకూర్మంలోనూ వేడుక

మబ్బులు పట్టిన సంధ్య వేళ సూరీడు మెరిసిపోయాడు. జగమంతా చీకటి అలముకున్న సమయాన ఇంద్ర పుష్కరిణిలో దేదీప్యమానంగా ప్రకాశించాడు. గర్భగుడి వదిలి భక్తుల గుండె గుడిలో ప్రత్యక్షమయ్యాడు. వేల మంది తన్మయులై చూస్తుండగా సతుల సమేతంగా కోవెల కొలనులో విహరించాడు. క్షీరాబ్ది ద్వాదశి నాడు అరసవల్లి సూర్యధామం ఆదిత్యుని నామస్మరణతో ప్రతిధ్వనించింది. హంసనావపై స్వామి పన్నెండు మార్లు పుష్కరిణిలో తిరుగాడాడు. రోజంతా స్వర్ణాలంకరణలో ధగధగా ప్రకాశించాడు.



తిరువీధిలో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ తదితరులు

అరసవల్లి: ప్రఖ్యాత అరసవల్లి క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ఆదిత్యుని తెప్పోత్సవం వైభవంగా జరిగింది. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా హంస వాహనంపై సూర్యనారాయణ స్వామి సతీసమేతంగా పవిత్ర ఇంద్రపుష్కరిణిలో 12 సార్లు విహరించారు. వేలాది మంది భక్తులు ఈ వేడుక చూసేందుకు తరలివచ్చారు. క్షేత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తెప్పోత్సవానికి ఏర్పాట్లు చేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు పాలకమండలి ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అలంకరణలు అన్నీ ఆకట్టుకున్నాయి. పుష్పాలంకరణ, బాణసంచా వెలుగులతో ఆలయ ప్రాంగణమంతా మెరిసిపోయింది. అలాగే శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు గర్భాలయంలో ఆదిత్యుడు స్వర్ణాలంకరణలో దర్శనమివ్వడంతో భక్తులు తిలకించి పులకించారు.

తిరువీధిగా వచ్చి...

శుక్రవారం సాయంత్రం 4.15 గంటల సమయానికే ఆలయంలోపల నుంచి వెండి సింహ వాహనంపై ఉషా పద్మిని ఛాయా దేవేరులతో సూర్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి హంస వాహనంలో వేంచింపజేశారు. ముందుగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ముందుగా గంగా పూజ నిర్వహించి హారతినిచ్చారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన క్రతువును భక్తులు తన్మయులై వీక్షించారు. విహారం అనంతరం వెండి సింహవాహనంపై ఉత్సవమూర్తులన మాఢ వీధుల్లో ఊరేగించి ఆలయానికి తీసుకెళ్లారు. అనివెట్టి మండపంలో ద్వాదశి వ్రతం చేశారు.

పుష్కరిణిలో కార్తీక దీపాల సందడి



ఇంద్ర పుష్కరిణిలో కార్తీక దీపారాధన

పుష్కరిణి పరిసరాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ప్రత్యేక దీపారాధన చేశారు. అరటి డొప్పల్లో కార్తీక దీపాలను వెలిగించి పుష్కరిణిలో విడిచిపెట్టారు. ఆలయ ఆవరణలో కాజీపేటకు చెందిన శ్రీసీతా రామ నాట్య కళామండలి ఆధ్వర్యంలో కోలాటం, చెక్క భజనల బృంద పాటలుతో పాటు సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, పాలకమండలి సభ్యురాలు మండవల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, లుకలాపు గోవిందరావు, మైలపల్లి లక్ష్మి, ఎస్.కోటేశ్వర చౌదరి, దుక్క గనిరాజు, జోగి మల్లెమ్మ, జె.శ్రీనివాస్, క్రైమ్ ఏఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు కోనా డ నరసింగరావు, జాతీయ మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మైలపల్లి పోలీసు, తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ శృతి,వన్‌టౌన్ సీఐ నా యుడు, ఎస్సై బలివాడ గణేష్ బందోబస్తు చర్యలు చేపట్టారు.



శ్రీకూర్మంలోని శ్వేత పుష్కరిణిలో కూర్మనాథుని విహారం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

పోలాకి: ఆపన్నులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం మబగాంలోని క్యాంప్ కార్యాలయంలో రూ.35లక్షలు విలువ చేసే రిలీఫ్ ఫండ్‌ను ఆరుగురు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పోలాకి, నరసన్నపేట ఎంపీపీలు ముద్దాడ భైరాగినాయుడు, ఆరంగి మురళీ, నరసన్నపేట సర్పంచ్ బూరెల్లి శంకర్, పార్టీ సీనియర్ నాయకులు చింతు రామారావు, ధర్మాన జగన్, సురంగి నరసింగరావు, పాగోటి రాజారావు తదితరులు ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జెడ్పీలో ఎన్నికల శిక్షణ శిబిరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికలకు నియమించిన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు మొదటి దశ ఎన్నికల శిక్షణ కార్యక్రమం ఈ నెల 25, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయా రోజుల్లో ఉదయం 10 గంటలకు సంబంధిత అధికారులంతా హాజరు కావాలని ఆదేశించారు. ఈనెల 25న శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నరసన్నపేట నియోజకవర్గాలకు చెందిన సెక్టార్ అధికారులు, 28న టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నంనకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్, ఈఆర్వోలు ఏఈఆర్వోలు వారి వారి సిబ్బందికి తగు సమాచారం ఇవ్వాలని, ఏ ఒక్కరూ గైర్హాజరు కాకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సంక్షేమ పథం



స్కూల్స్ బాగు పడ్డాయి

గతంలో గొట్టిపల్లి స్కూలు పరిస్థితి దారుణంగా ఉండేది. కనీస సౌకర్యాలు ఉండేవి కాదు. భవనాల కొరత వెంటాడేది. ఇప్పుడు నాడు–నేడులో ప్రభుత్వం స్కూల్‌ను అభివృద్ధి చేసింది. స్కూల్ మౌలిక వసతులు కల్పించారు. కార్పొరేట్‌కు దీటుగా స్కూల్‌లో సదుపాయాలు ఉన్నాయి. ఈ ఒక్క స్కూల్‌కు రూ.17 లక్షలు వెచ్చించారు. అప్పట్లో విద్యార్థులు 30 మందే ఉండేవారు. ఇప్పుడు 40 మంది వస్తున్నారు. విద్యార్థులకు తరగతుల బోధన కూడా బాగుంది. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేస్తున్నారు. అటు విద్యార్థులు, ఇటు వారి తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. ఉపాధ్యాయులుగా మాకూ గర్వంగా ఉంది

– హెచ్.ఆనందరావు, హెచ్ఎం, గొట్టిపల్లి



ఇంటికి యజమానులయ్యాం



మేము మధ్య తరగతికి చెందిన వాళ్లం. సొంతంగా ఇల్లు కట్టుకోలేక అనేక ఇబ్బందులు పడ్డాం. అద్దె ఇంట్లో ఉంటూ వచ్చాం. టీడీపీ హయాంలో అనేక మార్లు పక్కా ఇంటి కోసం దరఖాస్తు చేశాం. సొంత స్థలం ఉంటేనే ఇస్తామన్నారు. మాకేమో సొంత స్థలం లేదు. ఈ దశలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావడంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి స్థలం ఇచ్చి మాకు ఇల్లు మంజూరు చేశారు. పొదుపు లోన్లు ఇప్పించారు. ఇప్పుడు సొంతంగా ఇల్లు కట్టుకుని యజమానులయ్యాం. అద్దె బాధలు తప్పాయి. ఆనందంగా కుటుంబంతో ఉంటున్నాం. మా ఆనందానికి కారణం జగనన్నే.

– తుంగాన రమణమ్మ, బద్దవానిపేట, నరసన్నపేట

క్లుప్తంగా

వాటర్ గ్రిడ్ పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

మెళియాపుట్టి: ఉద్దానం ప్రజల కోసం ప్రభుత్వం నిర్మించిన వైఎస్సార్‌సుజల ధార ప్రాజెక్టు గురించి టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన శుక్రవారం ప్రాజెక్టును పరిశీలించారు. నీరు శుద్ధి చేసే పలు విభాగాల గురించి సిబ్బందితో మాట్లాడారు. అదేవిధంగా పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు సైతం ఈ ప్రాజెక్ట్ ద్వారా తాగునీరు అందుతుందని అధికారులు తెలియజేశారు. ఆయా పైప్‌లైన్ పనులు సైతం పరిశీలించారు. తహసీల్దార్ సరోజిని, వీఆర్వో అన్నాజీరావు పలువురు సిబ్బంది ఉన్నారు.

ఏఆర్ డీఎస్పీ, ఎస్‌బీ సీఐలకు సన్మానం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న ఏఆర్(ఆర్మ్‌డ్ రిజర్వ్) డీఎస్పీ డి.ప్రసాదరావు, స్పెషల్ బ్రాంచి సీఐ కోటేశ్వరరావులను ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో పోలీసు అధికారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా దుశ్శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. ఎస్పీ మాట్లాడుతూ అంకితభావంతో నిర్వర్తించే విధులు, సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఈ విషయంలో ఇద్దరి పనితీరు, విధుల పట్ల నిబద్ధత, సమయస్ఫూర్తి, విషయ పరిగణన అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామి, ఎస్‌బీ డీఎస్పీ బాలరాజు, ఏఓ గోపీనాథ్, ఎస్‌బీ సీఐ లక్ష్మణరావు, కంట్రోల్ రూమ్ సీఐ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు ఉమామహేష్, సురేష్, నర్సింగరావు, డీసీఆర్బీ ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌ఐలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'వంద రోజుల పని దినాలపై దృష్టి'



డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి వేతనదారులకు వంద రోజులు పని కల్పించేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు సిబ్బందిని సూచించారు. ఆయన శుక్రవారం జిల్లా కార్యాలయంలో అన్ని మండలాల టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి అడిగిన వారందరికీ పని కల్పించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి సగటు వేతనం రూ. 265 ఉండాలని, హౌసింగ్ 90 పని దినాల కల్పనకు సంబంధించి సత్వరం వాటిని పూర్తి చేయాలన్నారు. బినామీ మస్టర్లు వేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. లక్ష్యాల సాధనలో వెనుకబడితే సిబ్బంది వేతనాల్లో కోతలు విధిస్తామన్నారు. సకాలంలో వేతనాల చెల్లింపు దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పల్లె వనం పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రతి మండలంలోని 25 సెంట్లు విస్తీర్ణంలో 10 రకాల మొక్కలు వేస్తామని, సముద్రం, నదీ సంగమ ప్రాంతాల్లో మడ అడవుల పెంపకం దిశగా పెద్ద ఎత్తున దృష్టి సారించాలన్నారు. ప్రతి పంచాయతీకి సంబంధించి అక్కడ చేపట్టిన ఉపాధి హామీ పనుల విజయ గాథలను నవంబర్ 30వ తేదీ లోపు కార్యాలయానికి పంపించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీడీలు మురళీకృష్ణ, కె.లోకేష్, పి.రాధా, శైలజ, కార్యక్రమం నిర్వహణ అధికారి కేవీ అప్పలనాయుడు, ఇతర కార్యాలయ ఉద్యోగులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సెల్ పాయింట్‌లో చోరీ

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ కూడలి సమీపంలో ఓ సెల్‌ఫోన్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు షాపు యజమాని భాగ్‌రాజ్ తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం దుకాణం తెరిచి చూసేసరికి షాపులో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నట్లు గుర్తించారు. షాపు పై కప్పు నుంచి లోపలకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు షాపులోని బ్లూటూత్ పరికరాలు, స్పీకర్లు, చార్జర్లు, కీప్యాడ్ సెల్‌ఫోన్లు, మరమ్మతులకు వచ్చిన సెల్‌ఫోన్లతో పాటు ఇతర విలువైన వస్తువులు దొంగిలించినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.2లక్షలు వరకు ఉండవచ్చునని తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపారు.

చిరుధాన్యం.. సాగుకు ప్రాధాన్యం

- జిల్లాలో 20వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ
- యాభై శాతం రాయితీపై ఇతర రైతులకు పంపిణీ



కొత్తూరు మండలం గిట్టిపల్లి ప్రాంతంలో సాగు చేస్తున్న రాగి పంటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతుకు వివరిస్తున్న ఎంటీ సూర్యనారాయణ

కొత్తూరు: చిరు ధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జనాల్లో చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన పెరగడంతో వీటికి మంచి గిరాకీ లభిస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు ఈ సాగు వైపు మొగ్గు చూపేలా ప్రభుత్వం విత్తనాల కొనుగోలులో రాయితీలు ఇస్తోంది. రాగి, కొర్రలు వంటి విత్తనాలను సర్కారే రైతులకు పంపిణీ చేస్తోంది. ప్రాసెసింగ్ యూనిట్లను కూడా అందజేస్తోంది. జిల్లాలోని ముప్పై మండలాల్లో నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో రబీలో 20 వేల ఎకరాల్లో రాగితోపాటు కొర్రలు, ఇతర చిరు ధాన్యాలు సాగు చేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాయితీపై రాగి విత్తనాలు సుమారు 400 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఖరీఫ్‌లో ఇలా..

జిల్లాలో ఖరీఫ్‌లో దాదాపు ఐదు వేల ఎకరాల్లో చిరు ధాన్యాలు సాగు చేశారు. 200 క్వింటాళ్ల విత్తనాలు రాయితీపై అందించారు. రాగి, కొర్రలు పంటల సాగుకు అనువుగా ఉన్నందున రాగి సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడాది రబీలో సుమారు 10 వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది రబీలో 20 వేల ఎకరాల్లో సాగుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో రాగి పంట ఎక్కువగా సాగు చేయడంతో రాగి క్వింటా రూ.3850లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. రాగి పండిన పంట మొత్తాన్ని పౌర సరఫరా శాఖ కొనుగోలు చేసి తిరిగి అంగన్‌వాడీలు, మధ్యాహ్నం భోజనం పథకం, రెసిడెన్సియల్ పాఠశాలలకు పంపిణీ చేస్తుంది.

రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లు



జిల్లాలో రాగి, జొన్నలు వంటి పంటల సాగు పెంచాలన్న ఆలోచనతో మహిళా సంఘాలకు, రైతు ఉత్పత్తి సంఘాలకు రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నాం. రబీలో సాగునీటికి అవకాశం ఉన్న చోట 20 వేల ఎకరాల్లో రాగి, కొర్రలు సాగు చేసేందుకు నిర్ణయించాం. రాయితీపై 400 క్వింటాళ్ల రాగి విత్తనాలు పంపిణీ చేస్తాం.

– శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ

అవగాహన కల్పిస్తున్నాం



చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. పంట గిట్టుబాటు అయ్యేలా యాజమాన్య పద్ధతులపై తర్ఫీదు ఇస్తున్నాం. చిరుధాన్యాల వినియోగం బాగా పెరిగింది. అందుకే రైతులు సాగుచేస్తే గిట్టుబాటు అవుతుంది. కొండ ప్రాంతాల్లో సాగయ్యే పంటలు నేడు మైదాన ప్రాంతాల్లో సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.శ్రీనివాసరావు ఏఓ, కొత్తూరు మండలం

రాగి పంట గిట్టుబాటవుతోంది..



ప్రభుత్వం 90 శాతంపై రాగి విత్తనాలు పంపిణీ చేశారు. అంతర పంటలో రాగి పంట సాగు చేశాను. పంట బాగా పండింది. పంటకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. దీంతో గిట్టుబాటవుతోంది. పంట సాగుకు వ్యవసాయ సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు.

– ఊయక చిన్నమ్మి, గిరిజన మహిళ రైతు శోభనాపురం గిరిజన కాలనీ కొత్తూరు మండలం

ఉత్సాహంగా స్టేట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, అతిథులు



బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జెడ్పీ పాఠశాలలో శుక్రవారం 67వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ స్టేట్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ పోటీల్లో పాత 13 జిల్లాల నుంచి అండర్ 14, 17, 19 క్రీడాకారులు 390 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరయ్యారు. క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. డీఈఓ కె.వెంకటేశ్వరరావు క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన ద్వారా జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా పూర్తిస్థాయి సామర్థ్యాలను ప్రదర్శించాలని చెప్పారు. క్రీడలను పరిశీలించిన విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నిర్వాహకులను అభినందించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.

అనంతరం కేశవరావుపేట మైదానంలో అండర్ 14, 17 విద్యార్థులకు, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్ 19 విద్యార్థులకు లీగ్ పోటీలు నిర్వహించారు. మొదటి రోజు భోజన ఏర్పాట్లకు ప్రముఖ పారిశ్రామికవేత్త సూరి శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎచ్చెర్ల మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పైడి భాస్కరరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు సూర జగదీశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, కొత్తకోట సూర్యారావు, రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీవీజీ కృష్ణంరాజు, ఒలింపిక్ అసోసియేషన్ సీఈఓ సుందరరావు, టోర్నమెంట్ అబ్జర్వర్ అజేయ్‌కుమార్, డిప్యూటీ ఈవోలు జి.పగడాలమ్మ, ఆర్. విజయకుమారి, హెచ్‌ఎం చల్లా భారతి తదితరులు పాల్గొన్నారు.

'కోటబొమ్మాళి' విజయంపై సంబరం



శ్రీకాకుళంలో సన్‌మ్యాక్స్ థియేటర్ వద్ద కేక్ కట్ చేస్తున్న దర్శకుడి తల్లిదండ్రులు

శ్రీకాకుళం అర్బన్: మార్ని రవితేజ దర్శకత్వంలో తెరకెక్కిన కోటబొమ్మాళి పీఎస్ చిత్రం విజయవంతమైందని రవితేజ తల్లిదండ్రులు మార్ని రత్నాజీరావు, సత్యవాణి అన్నారు. వారు శుక్రవారం కోటబొమ్మాళి సినిమా విడుదల సందర్భంగా శ్రీకాకుళంలోని సన్‌మ్యాక్స్ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తేజ శ్రీకాకుళం నగరంలోని పీఎస్ కాలనీకి చెందినవాడని అన్నారు. తేజ దర్శకత్వంలో కరోనా సమయంలో జోహార్ సినిమాను ఓటీటీలో విడుదల చేశారని, రెండో సినిమా అర్జున–ఫల్గుణ చేశాడని, ఈ రెండు సినిమాలు ఎంతో విజయవంతం అయ్యాయన్నారు. దీని తర్వాత 5 సినిమాలకు దర్శకత్వం వహించే అవకాశం వచ్చిందని అన్నారు. ఈ సినిమాలు చూసిన తర్వాత బన్నీ వాసు సారథ్యంలో కోటబొమ్మాళి సినిమాకు అవకాశం ఇచ్చారన్నారు. తాము గత 30 ఏళ్లుగా శ్రీకాకుళంలోని పీఎస్ కాలనీలో ఉంటున్నామని వారు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. రవితేజ తమ్ముడు భానుసందీప్ కూడా సినిమాలపై మోజుతో జోహార్, అర్జున–ఫల్గుణ సినిమాకు నిర్మాతగా వ్యవహరించారని తెలిపారు.

'సమష్టి కృషితోనే విద్యా ప్రగతి'



ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావుని సన్మానిస్తున్న రాష్ట్ర చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: సమష్టి కృషితోనే విద్యా ప్రగతి సాధ్యమని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. ఎస్‌ఎం పురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం పూర్వపు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ప్రస్తుతం డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొక్కిరాల వెంకటగోపాల ధన బాలాజీలను సన్మానించారు. ఈ సమావేశంలో చాన్స్‌లర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ ప్రగతికి డైరెక్టర్‌గా జగదీశ్వరరావు వంద శాతం కృషిచేశారని అన్నారు. అకడమిక్‌గా, పరిపాలన పరంగా శ్రమించి విద్యా సంస్థను ముందుకు తీసుకు వెళ్లారని అన్నారు. కొత్తడైరెక్టర్ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మౌలిక వసతుల ప్రగతికి కృషి చేస్తుందని చెప్పారు. రెగ్యులర్ బోధకులు నోటిఫికేషన్ మేరకు నియామకాలకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు మాట్లాడుతూ విద్యా సంస్థల్లో అనేక సమస్యలు ఉంటాయని, సమయస్ఫూర్తి, అందరి సహకారంతో సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగినట్లు వివరించారు. ప్రస్తుత డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ మాట్లాడుతూ గత డైరెక్టర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగనున్నట్లు తెలిపారు. ఆర్‌జీయూకేటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు డైరెక్టర్‌గా రావటం అదృష్టమని చెప్పారు. కార్యక్రమంలో వోఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్ బాబు, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



పంచారామాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు, వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామాలకు నడుపుతున్న ఆర్టీసీ ప్రత్యేక బస్సులను భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు కోరారు. ఆయన శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వాకర్స్ క్లబ్ సభ్యులకు పంచారామ క్షేత్రాలు విశిష్టత వివరించి పంచారామాలకు సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. మహాశివునికి ప్రీతికరమైన సోమవారం ఒకే రోజు రాష్ట్రంలో ఉన్న ఐదు శైవ క్షేత్రాలు అనగా అమరావతిలో ఉన్న అమరేశ్వరస్వామి, భీమవరంలో ఉన్న సోమేశ్వరస్వామి, పాలకొల్లులో ఉన్న క్షీర రామలింగేశ్వరస్వామి, ద్రాక్షారామంలో ఉన్న భీమేశ్వరస్వామి, సామర్లకోటలో ఉన్న కుమారరామ భీమేశ్వరస్వామి వారి ఆలయాల దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. టికెట్ ఖరీదు రూ.2400గా నిర్ణయించామని తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం కూడా కల్పించామని అన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి. ఇందిరాప్రసాద్, పిజి గుప్తా, శాశపు జోగినాయుడు, బి.దేవీప్రసాద్, ఎం. మల్లిబాబు, బొడ్డేపల్లి ప్రసాదరావు, ఆర్టీసీ ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, టీఐ–3 ఎల్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఆర్‌పై అప్రమత్తత



నీలం రంగు దుస్తులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి, తదితరులు

అరసవల్లి: యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే వీటి నివారణకు సమష్టిగా కృషిచేద్దామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి పిలుపునిచ్చారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఎంఆర్ వారోత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సిబ్బంది అంతా నీలం రంగు దుస్తులు ధరించి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో భాగంగా యాంటీ బయాటిక్స్ మితిమీరిన వినియోగం, నిపుణుల సలహా లేకుండా ఇష్టానుసారంగా వినియోగిస్తే వ్యాధి కారకాలు రోగ నిరోధక శక్తి పెంచుకుని, ఏ మందులకూ లొంగకుండా ఉంటాయని, ఈ పరిస్థితినే యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అంటారని ఆమె వివరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి కె.సత్యనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్లు సూర్యకళ, మోహిని, మాస్‌మీడియా అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చేపలు, రొయ్యలు పెంపకంతో అధిక దిగుబడులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: చేపలు, రొయ్యల పెంపకంతో అధిక దిగుబడులు వస్తాయని, నాణ్యత విషయంలో జాగ్రత్త తీసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం నాణ్యమైన చేపలను వినియోగదారులకు అందించడంలో సాంకేతిక పద్ధతులు అవలంబించడానికి ఆత్మ పథకం ద్వారా రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చేపల పెంపకంలో మెలకువలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖాధికారి పీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ చేపలను దేశీయంగా మార్కెట్ చేయడానికి ప్రభుత్వం తరపున ఫిష్ ఆంధ్ర బ్రాండ్‌తో అవకాశం కల్పించిందని తెలిపారు. ఆత్మ పథక సంచాలకులు డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో పంట అనంతరం చేపట్టాల్సిన చర్యలు, విలువ ఆధారిత ఉత్పత్తులు నాణ్యమైన చేపలు సరఫరా వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ చేపలు నిల్వ చేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, రవాణా ప్యాకింగ్‌లో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎస్.నీలవేణి, బి.సునీత, మౌనిక, కిరణ్ కుమార్ మత్స్యశాఖ అధికారులు సంతోష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీఎఫ్‌సీ గోడౌన్లు పూర్తి చేయండి'



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎంపీఎఫ్‌సీ గోడౌన్ల నిర్మాణాలు తక్షణం పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 24 గోడౌన్ల వివరాలు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు పూర్తిగా చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన పనులు పూర్తి చేస్తే వాటికి బిల్లులు చెల్లిస్తామన్నారు. సహకార సంఘాల పని తీరుపై కో ఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ వర ప్రసాద్‌ను కలెక్టర్ అడుగగా అన్ని అప్‌డేట్‌గా ఉన్నట్లు చెప్పారు. జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ ప్రాథమిక సంఘాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు, కో ఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ వర ప్రసాద్, డీపీఓ రవి కుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి నాబార్డ్ డీడీ ఎం.వర ప్రసాద్, చేనేత శాఖ డెవలప్‌మెంట్ అధికారి రేజేటి శేఖర్, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, అగ్రికల్చర్ అండ్ మార్కెటింగ్ డీఈ కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



ప్రమాదస్థలం వద్ద రాయల దేవకి మృతదేహం



మృతురాలు దేవకి (ఫైల్)

కంచిలి: మకరాంపురం సంత కూడలి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాడుపూడి గ్రామానికి చెందిన మహిళ రాయల దేవకి (48) దుర్మరణం చెందారు. ఆమె కంచిలిలో రైల్వేక్వార్టర్స్‌లో నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ చిట్టికం దుర్గారావుతో కలిసి బైక్‌పై వెళుతుండగా.. అదే మార్గంలో వారి ముందు బైక్‌పై వెళుతున్న బిన్నళ కొత్తూరు గ్రామానికి చెందిన బుద్దాల వల్లభరావు హఠాత్తుగా మకరాంపురం సంత కూడలి వద్ద అవతలి రోడ్డువైపు ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండా బండి తిప్పేశాడు. దీంతో రెండు బైకులు ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో వెనుక బైక్‌లో కూర్చున్న దేవకి రోడ్డు మీద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారకుడైన వల్లభరావుకు, మృతురాలు కూర్చున్న వాహనాన్ని నడుపుతున్న దుర్గారావులకు స్వల్ప గాయాలయ్యాయి. దేవకి భర్త మృతి చెందగా, ఆమెకి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రకాశరావు ఆటో నడుపుతూ జీవనం పొందుతున్నాడు. ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లోకి దూసుకుపోయిన కారు



పంటపొలంలోకి జారిపడి నుజ్జయిన కారు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చిన బడాం గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపు తప్పి పంటపొలంలోకి దూసుకుపోయింది. కాశీబుగ్గ రైల్వే వంతెన పనుల్లో భాగంగా సర్వీసు రోడ్డులో రాకపోకలు జరుగుతుండడంతో ఆర్మీ క్యాంటీన్ వద్ద సంఘటన చోటు చేసుకుంది. ఇచ్ఛాపురానికి చెందిన రమేష్ అనే యువకుడు అతివేగంగా సర్వీస్ రోడ్డులోకి వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు గమనించి బయటకు తీసి 108 వాహనానికి సమాచారం అందించడంతో ప్రథమ చికిత్స నిర్వహించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు చాణక్య

పూసపాటిరేగ,నరసన్నపేట: సీహెచ్ అగ్రహారం సమీపంలో శుక్రవారం సాయంత్రం జాతీయరహదారి దాటుతుండగా కారు ఢీకొనడంతో నరసన్నపేట మండలం బాలసీమ గ్రామానికి చెందిన ఆరంగి చాణక్య (29) మృతి చెందాడు. సీహెచ్ అగ్రహారం సమీపంలో చాణక్య జాతీయరహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పంచనామా అనంతరం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం మాయంపై ఖాతాదారుల ఆందోళన



బ్యాంకు వద్ద ఖాతాదారులు

గార: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచిలో బంగారం మాయమైందన్న పుకారుతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులో ఓ ఖాతాదారు తాను తనఖా పెట్టిన బంగారం విడిపించేందుకు బ్యాంకుకు వెళ్లగా బంగారం కనబడటం లేదని సమాధానం ఇచ్చారని, దీంతో ఆ ఖాతాదారు బయటికి వచ్చి చెప్పారని అంటున్నారు. సాయంత్రం సరికి కొందరు ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరుకోగా బ్యాంకు మేనేజర్ సీహెచ్. రాధాకృష్ణ రెండు రోజుల్లో విషయం తెలుస్తుందని చెప్పారు. పోలీసులు జోక్యంతో ఖాతాదారులు వెనుదిరిగారు.